క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఖాజాబీ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ధర్మరాజుపల్లి, రంగాపూర గ్రామాల్లో పోతిరెడ్డిపేట, సిర్సపల్లి గ్రామాల్లో శుక్రవారం బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేశామని బాలవికాస ప్రతినిధి ఖాజాబీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లాచారి, లక్ష్మారెడ్డి, వార్డుసభ్యులు బొడ్డు రజిత, కొమురమ్మ, సదాదేవి, లావణ్య తదితరులు ఉన్నారు.

వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు



ముస్తాబైన బ్రహ్మంగారి దేవాలయం

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రోటిగూడకు చెందిన శ్రీహరిమౌనస్వామి ఆధ్వర్యంలో దేవాలయ ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం గణపతి పూజ అగ్ని ప్రతిష్టాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, సోమవారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకి సేవ ఉంటుందని, మంగళవారం రుద్రాభిషేకం, రుద్ర హోమం జరుగుతాయని తెలిపారు.

పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శికి వినతి



విన్నవిస్తున్న జాక్ నాయకులు

శంకరపట్నం: ఉపాధిహామీ ఉద్యోగులకు పేస్కేల్ ఇవ్వాలని శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు జాక్ నాయకులు వినతిపత్రం అందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఉపాధిహామీ ఉద్యోగులు జిల్లా జాక్ చైర్మన్ శారద ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, మంత్రి దయాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. పేస్కేల్ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇప్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో శోభ, జగదీశ్ తదితరులు ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

వీణవంక: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి సభ్యులు, రైతులు హాజరుకాకపోవడంతో సమావేశం వాయిదా పడింది. చైర్మన్‌తో పాటు 12 మంది డైరెక్టర్లు, ముగ్గురు రైతులు హాజరయ్యారు. త్వరలో సమావేశం నిర్వహిస్తామని చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ప్రకటించారు. సంఘం వైస్ చైర్మన్ మేరీ, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య యాదవ్, గూటం సమ్మిరెడ్డి, తిరుమల్, మధుసూదన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

నియామకం



శ్రీనివాస్‌గౌడ్

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన జాగిరి శ్రీనివాస్‌గౌడ్ వైఎస్సార్‌టీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈమేరకు పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ, నేడు వైఎస్ షర్మిల నేతృత్వంలో వైఎస్సార్‌టీపీలో పని చేయడం గర్వంగా ఉందన్నారు. ఈసందర్భంగా పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని, నియామకానికి సహకరించిన రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేష్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉక్కపోతతో ఉండలేక..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఇబ్బందులు
- మౌలిక వసతులు కరువు
- అద్దె ఇళ్లలో పరిస్థితి దయనీయం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



వెదిర ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

రామడుగు: చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించే అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. కేంద్రాలపై ప్రభుత్వం శీతకన్ను చూపడంతో అరకొర వసతులతో చిన్నారులు నిత్యం ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొంది. కనీస వసతులు లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం ఉన్నా ప్యాన్లు లేక చిన్నారులు ఉక్కపోత భరించలేకపోతున్నారు. మరికొన్ని కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేదు. చిన్నారుల బాధలు చూడలేక పలువురు ప్యాన్లు వితరణ చేస్తున్నారు.

- మండలంలోని 23 గ్రామాలలో 58 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగ వీటిలో 3 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు.
- 25 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 15 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా 18 అద్దె లేకుండా కొనసాగుతున్నాయి.
- గర్భిణులు 351, బాలింతలు 337, 6 నుంచి 3 సంవత్సరాలలోపు పిల్లలు 1,451, ఐదేళ్ల లోపు పిల్లలు 2,448 మంది అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలు..

- అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రధానంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు. కొన్ని కేంద్రాల్లో ఉన్నా నీటి సౌకర్యం కల్పించకపోవడంతో నిరుపయోగం ఉన్నాయి.
- అద్దె ఇళ్లల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. కనీసం పిల్లలు మూత్రం చేయడానికి వీలులేని పరిస్థితి ఉందని అంగన్‌వాడీ టీచర్స్ ఆవేదన చెందుతున్నారు.
- ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి తాగునీటి వసతి కల్పించాలని ఉన్నప్పటికీ మిషన్‌భగీరథ నల్లా కనెక్షన్ ఇవ్వకపోవడంతో చిన్నారులు తాగునీటికి నోచుకోలేని దుస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాలకు నల్లా కనెక్షన్ ఇచ్చినప్పటికీ నీరు రాని పరిస్థితి ఉంది.
- విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చిన్నారులకు ప్యాను సౌకర్యం లేకుండాపోయింది. కేంద్రాలలో చిన్నారులు ఉక్కపోతతో గడపాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాలకు స్వచ్ఛంద సంస్థ ప్యాన్లు అందజేసినప్పటికీ వాటిని బిగించుకోలేకుండా ఉన్నామని అంగన్‌వాడీ టీచర్స్ తెలిపారు.
- వంట చేయడానికి కేంద్రాలలో ప్లాట్‌ఫామ్స్ లేకపోవడంతో సిలిండర్, స్టౌవ్ కింద పెట్టి వంట చేస్తున్నామని ఆయాలు ఆవేదనతో చెందుతున్నారు. అద్దె ఇళ్లలో ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి ఒప్పుకోవడం లేదని వాపోతున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం రూ. వెయ్యి అద్దె చెల్లిస్తోంది. గ్రామాలలో కేంద్రం నిర్వహణకు సరిపడా ఇండ్ల దొరకడంలేదని పలువురు టీచర్స్ పేర్కొంటున్నారు.
- సమస్యలను ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు చిన్నారులకు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని చిన్నారుల తల్లులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



చాలా అంగన్‌వాడీ కేంద్రాలలో మూత్రశాలలు, మరుగుదొడ్ల లేకపోవడంతో చిన్నారులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని పలుమార్లు అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. కేంద్రాలలో ప్రభుత్వం కనీస వసతులు కల్పించాలి.
– భాగ్యరాణి, అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు, గంగాధర ఐసీడీఎస్ ప్రాజెక్టు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



చొప్పదండి: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవిశంకర్



గన్నేరువరంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



చిగురుమామిడి: గునుకులపల్లెలో..

హుజూరాబాద్: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ముందుగానే కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చొప్పదండి,గంగాధర, రామడుగు: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాల్లోని వివిధ గ్రామాలలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తూకం విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి

గన్నేరువరం: రైతులు, పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.

చిగురుమామిడి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకట్ మణారెడ్డి కోరారు. మండలంలోని గునుకులపల్లే, గాగిరెడ్డిపల్లే, ఓగులాపూర్ గ్రామాల్లో డైరెక్టర్లతో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

పశువైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

ఇల్లందకుంట: మండలంలోని లక్ష్మాజిపల్లి గ్రామంలో విజయ డెయిరీ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి ప్లవన్ మజుందర్ మాట్లాడుతూ.. పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి నట్టల నివారణ మందులు పంపిణీ చేశామని, ఇతర వ్యాధులకు ఉచితంగా ఇంజక్షన్లు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ ఆరెల్లి జ్యోత్స్న శ్రీనివాస్, జూనియర్ పశువైద్యులు రాజు, విజయ డెయిరీ బీఎంసీయూ ఇన్‌చార్జి సతీష్, ప్రెసిడెంట్ రాజిరెడ్డి, స్టాఫ్ సాయి, మహేష్, గోపాల మిత్ర శ్రీను, వెటర్నరీ సిబ్బంది, కెప్లెర్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' ఆడబిడ్డలకు వరం

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న కౌశిక్‌రెడ్డి

వీణవంక: పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకూడదని ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి, వైస్‌ఎంపీపీలత శ్రీనివాస్, సర్పంచ్ నీల కుమారస్వామి,ఉపసర్పంచ్ భానుచందర్, వార్డు సభ్యులు మహేష్, రాజు, సంపత్,డైరెక్టర్ రాములు, కృష్ణచైతన్య, క్రాంతి, మధు, పున్నం చందర్, కాసర్ల సుధాకర్, నాగిరెడ్డి ,ఆనందం, రాజమల్లు, లింగయ్య, రెడ్డిరాజుల రవి పాల్గొన్నారు.

దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

వీణవంకలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణ మండపం నిర్మాణానికి కౌశిక్‌రెడ్డి భూమి పూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో అన్నివిధాల సౌకర్యాలు కల్పించడంతోపాటు దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. రూ. 40 లక్షలతో కల్యాణ మండపం నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వేదపండితు లు గూడ జగదీశ్వర్‌శర్మ, ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, సర్పంచ్ నీల కుమారస్వామి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఒరెం భానుచందర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ మేళా



చొప్పదండి: మాట్లాడుతున్న అధికారులు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో శుక్రవారం ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యా బోధన అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, కౌన్సిలర్ భూమేశ్ తెలిపారు. పిల్లలకు ఆటపాటలతో విద్యా, పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. ఎంపీటీసీ సునంద, పిల్లల తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని శ్రీరాములపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. సర్పంచ్ సంధ్యాబాపురావు మాట్లాడారు. ప్రైవేట్ స్కూలుకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన మంచి పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందన్నారు. గర్భిణులకు, పిల్లల ఎదుగుదల గుర్తించి సూచనలు చేయడంతోపాటు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌లకు పంపించాలని చిన్నారుల తల్లిదండ్రులను కోరారు. అనంతరం చిన్నారుల రైమ్స్, కథలు, పాటలు, ఆటలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంగన్‌వాడీ టీచర్ స్వర్ణ, ఆయా సుమలత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'దళితబంధు'తో వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: దళితబంధుతో లబ్ధిదారులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయిరూప గార్డెన్స్‌లో వివిధ రకాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు పథకంతో సేల్స్‌మెన్ యజమానులుగా, క్లీనర్లు, డ్రైవర్లు ఓనర్లుగా మారారని, సొంతంగా షాపులు పెట్టుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, బి. శ్రీనివాస్, మండల అభివృద్ధి అధికారులు విజయలక్ష్మి, కల్పన, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సెక్రెటరీ గణపతి, దళిత బంధు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

రామడుగు: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కార్యకర్త అనుపురం దీపక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ తరఫున రూ. రెండు లక్షల బీమా చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే దీపక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రతి కార్యకర్తను పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు వీర్ల ప్రభాకర్‌రావు, ఒంటెల మురళీకృష్ణారెడ్డి, పలుగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

గంగాధర: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన ఈదులు గాలులు, అకాల వర్షానికి నష్టపోయిన మామిడి రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. 20 వేల పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మామిడితోటలను సందర్శించి రైతులతో మాట్లాడారు. గతంలోనూ రైతులు నష్టపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పటికైనా అధికారులతో సర్వే నిర్వహించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకలు రేండ్ల శ్రీనివాస్, తూం కరుణాకర్, కాటం శ్రీనివాస్,మనోహర్, తాళ్ల శేఖర్,వినయ్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్: చదువుకునే రోజుల్లో తండ్రి మరణం, మనుమడిని చేరదీసిన నానమ్మ, తాతయ్య ఇటీవల మృతిచెందడంతో మనస్తాపం చెందిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యచేసుకున్న ఘటన శుక్రవారం వచ్చునూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఈగ రాజ్‌కుమార్(31) తండ్రి వెంకటేశం పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి నానమ్మ తాతయ్యల వద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో రాజ్‌కుమార్‌కు ఏడాది క్రితం వివాహమైంది. ఈక్రమంలో కొంతకాలం ప్రైవేట్ పాఠశాలలో పనిచేసి మానేశాడు. అప్పటినుంచి తల్లితో ఇంటివద్దే ఉంటున్నాడు. కొంతకాలంగా మనస్తాపం చెందుతూ పలుమార్లు ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో వంటగదిలోకి వెళ్లి దూలానికి ఉరేసుకుని, కత్తితో గొంతు కోసుకుని చనిపోయినాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో ఎస్సై ప్రమోద్‌రెడ్డి ఘటన స్థలాన్ని వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం

ఇద్దరిపై కేసు నమోదు

వీణవంక : మండలంలోని చల్లూరు గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్ముక్కుల, మామిడాలపల్లి గ్రామాలకు చెందిన బొంగోని పవన్‌సాయి, మిర్యాల రంజిత్ రెడ్డి ఇద్దరు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చల్లూరు శివారులో పోలీసులు తనిఖీ చేశారు. వారి నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, తహసీల్దార్ రాజయ్యకు సమాచారం అందించడంతోపాటు పంచనామా నిర్వహించామన్నారు. అనంతరం ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు. ఎవరైనా గంజాయి సేవించినా, తరలించినా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

సాన్వికకు సాయం చేయరూ..

- నిమోనియాతో బాధపడుతున్న చిన్నారి
- రోజుకు రూ.లక్ష వరకు ఆస్పత్రి ఖర్చు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు

సైదాపూర్: జ్వరంతో ఆస్పత్రికి వెళ్లిన చిన్నారి నిమోనియా అని తేలడంతో ప్రస్తుతం హైదరాబాద్ రేయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రోజుకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చు అవుతోంది. బిడ్డను రక్షించుకోవడానికి ఆపన్న హస్తం కోసం తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. సైదాపూర్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన తీగల శ్రీకళ–లక్ష్మీనారాయణగౌడ్ దంపతుల కూతురు సాన్విక యూకేజీ చదువుతోంది. సంతోషంగా, ఆడుతూ, పాడుతూ బడికి వెళ్లి వస్తున్న సాన్వికకు ఈ నెల 4న జ్వరం రావడంతో ఆస్పత్రిలో చూపించారు. నిమోనియాగా నిర్ధారణ కావడంతో ఈ నెల 8న హైదరాబాద్ రేయిన్‌బోలో చేర్పించారు. లక్ష్మీనారాయణ ప్రయివేటు చిరుద్యోగి కావడంతో ఆర్థికంగా రూ.లక్షలు వెచ్చించి వైద్యం చేయించి బిడ్డను రక్షించుకునే పరిస్థితిలో లేడు. బిడ్డను రక్షించుకోవడానికి దాతల నుంచి ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

సాయం చేయాలనుకునేవారు

ఫోన్‌పే, గూగుల్‌పే
తీగల లక్ష్మీనారాయణ
99597 12613
కెనరా బ్యాంకు ఖాతా నంబరు
110042568689
IFSC
CSRB 006485



చికిత్స పొందుతున్న చిన్నారి సాన్విక

సీపీఆర్‌తో ప్రాణాపాయం తప్పుతుంది




అవగాహన కార్యక్రమంలో ఎస్సై ప్రమోద్ రెడ్డి

తిమ్మాపూర్: రోడ్డు ప్రమాదాలు, గుండెపోటుకు గురైనవారిని కాపాడడంలో సీపీఆర్ ప్రక్రియ కీలకంగా పని చేస్తుందని తిమ్మాపూర్ సర్కిల్ సీఐ రమేశ్ అన్నారు. ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలో రాష్ట్ర రోడ్డు సేఫ్టీ ఆర్ఐ వైవీ. ప్రతాప్, ఈఎంఆర్ఐ ప్రతినిధి సుమన్ ఆధ్వర్యంలో వాగేశ్వరి కాలేజీలో శుక్రవారం సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)పై ఆటోడ్రైవర్లు, పోలీసు సిబ్బందికి అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్ ఎలా చేయాలనే దానికిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం కోసం రాష్ట్ర రోడ్డు సేఫ్టీ, జీవీకే, ఈఎంఆర్ఐ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గుండె ఆగిపోయిన సందర్భాలలో సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అలాగే పోలీస్ సిబ్బంది అందరికి సీపీఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ప్రమోద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు నిధులు కేటాయించాలి

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో తాపీమేస్త్రీ సంఘ భవనానికి నిధులు కేటాయించాలని సర్పంచ్ దామెర విద్యాసాగర్ రెడ్డి, ఎంపీటీసీ గల్ల సునంద ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు రూ. 5 లక్షల నిధులు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో నాయీబ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి ఇటీవల రూ. 5 లక్షలు మంజూరు చేశారని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

రంజాన్ కానుకలు పంపిణీ



జమ్మికుంట: మున్సిపల్ పరిధి ఆరోవార్డులోని దారుసలాం మసీదులో రంజాన్‌ను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అందించిన కానుకలను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుందని, మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో వేసవి కాలం దృష్ట్యా తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లీకేజీలకు మరమ్మతు పనులను పరిశీలించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్ మజీద్‌లో ముస్లింలకు బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ నిషాని రామచంద్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఇఫ్తార్ విందులో ముస్లిం పెద్దలు, యువకులు, అసెంబ్లీ ఇన్‌చార్జి కుమ్మరి సంపత్, మండల అధ్యక్షులు దాసరి కొమురయ్య, సీనియర్ నాయకులు సిరిసిల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: రంజాన్ పురస్కరించుకుని గుండ్లపల్లిలోని మసీదులో ముస్లింలకు శుక్రవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం షాదీముబారక్ చెక్కులు, రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా, మండల కోఆర్డినేటర్లు గూడెల్లి తిరుపతి, బద్దం తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి అంజనేయులు, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

తిమ్మాపూర్: పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం జుమ్మాతుల్ విదా సందర్భంగా తిమ్మాపూర్ జామా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌల్వీ మహమ్మద్ రఫీ పవిత్ర రంజాన్ మాసం ప్రాముఖ్యతను, ఈదుల్ ఫితర్ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో జామా మసీదు అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, మహమ్మద్ హుస్సేన్, సాధిక్, యాఖూబ్, జహంగీర్, అఫ్రోస్, అజీజ్, మాక్సూద్, అప్పు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మహాత్మానగర్ మసీదులో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఏకానందం, వెంక రెడ్డి, అశోక్ రెడ్డి, రవీందర్ రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు.